# అమ్మాయిలు అదుర్స్

- రాణించిన జెమీమా, దీప్తి, రిచా
- భారత్ తొలి ఇన్నింగ్స్ 376/7
- ఆస్ట్రేలియాతో ఏకైక టెస్టు


మందన (74)

ముంబై: భారత్, ఆస్ట్రేలియా మహిళల జట్ల మధ్య జరుగుతున్న ఏకైక టెస్టు ఆసక్తికరంగా సాగుతున్నది. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ మన అమ్మాయిలు అదరగొడుతున్నారు. ఇంగ్లండ్‌పై చరిత్రాత్మక విజయంతో ఆత్మవిశ్వాసంతో ఉన్న టీమ్‌ఇండియా..ఆస్ట్రేలియాతో అదే పోరాటపటిమ కనబరుస్తున్నది. ఓపెనర్ స్మృతి మందన(74), జెమీమా రోడ్రిగ్స్(73), దీప్తిశర్మ(70 నాటౌట్), రీచా ఘోష్(52) అర్ధసెంచరీలతో కదంతొక్కడంతో శుక్రవారం రెండో రోజు ఆట ముగిసే సరికి తొలి ఇన్నింగ్స్‌లో 376/7 స్కోరు చేసింది. దీప్తితో పాటు వస్త్రాకర్(33 నాటౌట్) క్రీజులో ఉన్నారు. గార్డ్‌నర్(4/100) నాలుగు వికెట్లు దక్కించుకుంది.

### రాణించిన మందన


దీప్తిశర్మ (70 నాటౌట్)

ఓవర్‌నైట్ స్కోరు 98/1తో రెండో రోజు ఆట కొనసాగించిన ఓవర్‌నైట్ బ్యాటర్లలో మందన నిలకడగా ఆడినా.. స్నేహ్ రాణా (9) విఫలమైంది. మందన 68 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకుంది. అయితే 35వ ఓవర్లో రాణా ఔట్ కావడంతో 50 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. అరంగేట్రం బ్యాటర్ రీచా ఘోష్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను మందన ముందుకు తీసుకెళ్లింది. ఈ క్రమంలో రిచాతో నెలకొన్న సమన్వయం లోపంతో మందన రనౌట్‌గా వెనుదిరుగడంతో 147 వద్ద భారత్ మూడో వికెట్ కోల్పోయింది. ఆసీస్ బౌలర్లకు పరీక్షకు పెడుతూ జెమీమా, రీచా సాధికారిక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నారు. ఆఖర్లో దీప్తి, పూజతో కలిసి విలువైన పరుగులు రాబట్టింది.

# స్వదేశానికి కోహ్లీ

సెంచూరియన్: దక్షిణాఫ్రికాతో కీలకమైన టెస్టు సిరీస్‌లో భారత క్యాంప్‌లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ శుక్రవారం స్వదేశానికి తిరుగుపయనమయ్యాడు. కోహ్లీ కుటుంబంలో ఎలాంటి ఎమర్జెన్సీ ఉందన్న విషయంలో బీసీసీఐ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. అయితే ఈ నెల 26నుంచి ఇరు జట్ల మధ్య మొదలయ్యే తొలి టెస్టు నాటికి తిరిగి జట్టుతో చేరుతాడని టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ ఒక ప్రకటనలో పేర్కొంది. మరోవైపు దక్షిణాఫ్రికాతో రెండో వన్డే సందర్భంగా క్యాచ్ అందుకునే క్రమంలో రుతురాజ్ గైక్వాడ్ చేతి వేలికి గాయం అయిందని బోర్డు వర్గాలు తెలిపాయి.




బొల్లారంలో శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏర్పాటు చేసిన ఎట్ హోమ్ కార్యక్రమానికి హాజరైన భారత బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్

# పునియా పద్మశ్రీ వాపస్

- అవార్డు వెనక్కి ఇచ్చేసిన దిగ్గజ రెజ్లర్
- మహిళా రెజ్లర్లకు అన్యాయంపై ప్రధాని మోదీకి లేఖ
- రెజ్లింగ్ సంఘం అధ్యక్షుడి ఎన్నికపై రెజ్లర్ల సంచలన నిర్ణయాలు
- కెరీర్లను పణంగా పెడుతున్న వైనం

*భారత కుస్తీ రంగంలో మరో కుదుపు. జాతీయ రెజ్లింగ్ అసోసియేషన్ (డబ్ల్యూఎఫ్‌ఐ)అధ్యక్ష ఎన్నిక వివాదం చిలికి చిలికి మరింత వివాదంగా మారుతున్నది. మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ సన్నిహితుడు సంజయ్‌సింగ్ ఎన్నికపై రెజ్లర్లు సంచలన నిర్ణయాలతో కదంతొక్కుతున్నారు. విశ్వక్రీడల్లో దేశానికి పతకం అందించిన ఏకైక మహిళా రెజ్లర్‌గా నిలిచిన సాక్షి మాలిక్ ఇప్పటికే ఆటకు వీడ్కోలు పలుకగా, తాజాగా దిగ్గజ రెజ్లర్ బజరంగ్ పునియా పద్మశ్రీ అవార్డు వాపస్ ఇస్తున్నట్లు ప్రకటించాడు. మహిళా రెజ్లర్లకు జరుగుతున్న అన్యాయంపై ప్రధాని నరేంద్రమోదీకి పునియా సుదీర్ఘ లేఖ రాశాడు. మహిళా రెజ్లర్లకు అన్యాయం జరుగుతున్నప్పుడు ఈ అవార్డు ఎందుకంటూ సూటిగా ప్రశ్నించాడు. మొత్తంగా రెజ్లింగ్ ఎన్నిక వివాదం ఎటు వైపునకు దారితీస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.*

న్యూఢిల్లీ: జాతీయ రెజ్లింగ్ సమాఖ్య(బీడబ్ల్యూఎఫ్) ఎన్నికల అంశం మరోమారు వార్తల్లో ప్రముఖంగా నిలుస్తున్నది. బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్ సన్నిహితుడుగా ముద్రపడ్డ సంజయ్‌సింగ్ ఎన్నికను దిగ్గజ రెజ్లర్లు బజరంగ్ పునియా, సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆయన ఎన్నికకు నిరసనగా ఇప్పటికే సాక్షి మాలిక్ తన రెజ్లింగ్ కెరీర్‌కు అనూహ్యంగా వీడ్కోలు పలుకగా, తాజాగా బజరంగ్ పునియా పద్మశ్రీ అవార్డు వాపస్ ఇస్తున్నట్లు ప్రకటించి సంచలనం కల్గించాడు. గంటల వ్యవధిలో ఇద్దరు దిగ్గజ రెజ్లర్లు తమకు జరుగుతున్న అన్యాయాన్ని దేశం దృష్టికి తీసుకొచ్చారు. మహిళా రెజ్లర్లకు న్యాయం జరుగకపోవడాన్ని ప్రశ్నిస్తూ పునియా తనకు దక్కిన పద్మశ్రీ అవార్డును ప్రధాని నరేంద్రమోదీకి అందజేసేందుకు శుక్రవారం కర్తవ్యపథ్ వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తన పద్మశ్రీ అవార్డును ప్రధాని నివాసం ముందు ఉంచేందుకు ప్రయత్నించగా, అధికారులు నిలువరించారు.


శుక్రవారం న్యూఢిల్లీలోని ప్రధాని నరేంద్ర మోదీ నివాసం వద్ద చేతిలో పద్మశ్రీ అవార్డుతో నిరాశలో ఉన్న దిగ్గజ రెజ్లర్ బజరంగ్ పునియా

### ఎన్నిక ఏకపక్షంగా

జాతీయ రెజ్లింగ్ సమాఖ్య(బీడబ్ల్యూఎఫ్) ఎన్నికలు పూర్తి ఏకపక్షంగా సాగాయి. కోర్టు తీర్పులు, పలు వాయిదాల తర్వాత ఈ నెల 21న జరిగిన ఎన్నికల్లో బ్రిజ్‌భూషణ్ వర్గం 15 స్థానాలకు 13 స్థానాలు దక్కించుకుని తమకు తిరుగులేదని నిరూపించుకుంది. ఇందులో యూపీకే చెందిన సంజయ్ సింగ్ ఎన్నిక కావడం ఇన్ని రోజులు నిరసన చేసిన రెజ్లర్లను తీవ్ర మనస్థాపానికి గురిచేసింది. దేశ రాజధానిలో తాము ఇన్నాళ్లు చేసిన పోరాటానికి విలువలేకుండా పోయిందనుకున్న రెజ్లర్లు తమ కెరీర్లను వదులుకునేందుకు సిద్ధమయ్యారు. సాక్షి మాలిక్ బూట్లను బెంచ్‌పై పెడుతూ రెజ్లింగ్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించింది అందరనీ ఆశ్చర్యపరిచింది. ఇప్పుడు ఇదే కోవలో బజరంగ్ పునియా అవార్డు వాపస్ ఇవ్వడంతో రెజ్లర్ల నిరసన మరోమారు తెరపైకి వచ్చింది.


## పద్మశ్రీ అవార్డు నాకొద్దు: బజరంగ్‌పునియా



సంజయ్‌సింగ్ ఎన్నికపై ప్రధాని మోదీకి రాసిన లేఖలో పునియా పలు అంశాలను ప్రస్తావించాడు. దీన్ని ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. స్వయంగా లేఖను అందిద్దామనుకున్న పునియాకు నిరాశే ఎదురైన నేపథ్యంలో సోషల్‌మీడియా ద్వారా తన నిరసనను వ్యక్తపరిచాడు. 'డియర్ మోదీ మీ ఆరోగ్యం బాగుందనుకుంటున్నా. మీరు చాలా పనుల్లో బిజీగా ఉండి ఉంటారు. దేశంలో మహిళా రెజ్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను మీ దృష్టికి తీసుకొస్తున్నా. మీరు కచ్చితంగా కొన్ని విషయాలు తెలుసుకోవాలి. బ్రిజ్‌భూషణ్ నుంచి మహిళా రెజ్లర్లు లైంగికంగా ఎదుర్కొంటున్న సమస్యలపై గత జనవరిలో మేము అందరం కలిసి నిరసనల్లో పాల్గొన్నాం. నేను కూడా ఇందులో పాలుపంచుకున్నాను. కానీ ప్రభుత్వం ఇచ్చిన హామీతో మేము నిరసన విరమించాం. ఆ తర్వాత బ్రిజ్‌భూషణ్‌పై మూడు నెలల కాలంలో ఎలాంటి ఎఫ్‌ఐఆర్ నమోదు కాలేదు. దీంతో మేము మళ్లీ పోరుబాట పట్టాల్సి వచ్చింది. ఏప్రిల్‌లో మేము ధర్నాకు దిగడంతో పోలీసులు అతనిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. జనవరిలో అతనిపై 19 ఫిర్యాదులు వస్తే..ఏప్రిల్ వరకు అవి 7కు పడిపోయాయి. అంటే 12 మంది రెజ్లర్లను బ్రిజ్‌భూషణ్ ఏ రకంగా బెదిరింపులు గురి చేశాడో మీరు అర్థం చేసుకోవచ్చు. 40 రోజుల పాటు ఢిల్లీ నడిబొడ్డున మేము నిరసన చేశాం. ధర్నా చేసినన్ని రోజులు చాలా రకాల ఒత్తిళ్లకు గురయ్యాం. మేము నిరసన చేస్తున్న స్థలం నుంచి మమ్మల్ని బలవంతంగా పోలీసులు ఈడ్చుకెళ్లారు. అప్పుడు ఏం చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో మేము సాధించిన పతకాలను మే 19న హరిద్వార్‌లోని గంగా నదిలో కలిపేయాలనుకున్నాం. కానీ రైతు సంఘాల నేతలు, కోచ్‌లు, పలువురి సూచనలతో మా నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నాం. ఆ సమయంలో మీ క్యాబినెట్ మినిస్టర్ చర్చలకు పిలిచారు. మాకు న్యాయం జరగుతుందని హోం శాఖ మంత్రి కూడా హామీ ఇచ్చారు. అందువల్ల మేము నిరసన ఆపేస్తున్నట్లు ప్రకటించాం. కానీ మా డిమాండ్లను మీరు పట్టించుకోలేదు. ఫలితంగా మళ్లీ అదే వర్గానికి చెందిన వారే పగ్గాలు అందుకున్నారు. ఇప్పుడు ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో గత రాత్రంతా ఏడ్చుకుంటూ కూర్చుకున్నాం. మీ ప్రభుత్వం ఇప్పటి వరకు చాలా ఇచ్చింది. 2019లో నన్ను పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. దీనికి తోడు అర్జున, ఖేల్‌రత్న అవార్డులు అందుకున్నాను. ఇవి అందుకున్నప్పుడు నేను ఎంతో గర్వపడ్డాను. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. క్రీడలతో మహిళల్లో సాధికారత పెరగడంతో పాటు వాళ్ల జీవితాల్లోనూ మార్పు వచ్చింది. ఇప్పుడున్న పరిస్థితుల్లో అమ్మాయిలు క్రీడల నుంచి దూరమయ్యే వాతావరణం నెలకొంది. బేటీ బచావో..బేటీ పడావోకు బ్రాండ్ అంబాసిడర్లుగా నిలిచేవారు. మహిళా రెజ్లర్లకు అన్యాయం జరుగుతున్న వేళ..పద్మశ్రీ అవార్డు గ్రహీతగా ఉండలేకపోతున్నాం. రెజ్లర్లను అవమానపరుస్తున్నందుకు ఈ అవార్డును వాపస్ ఇస్తున్నాను' అని ప్రకటించాడు.

### అది అతని వ్యక్తిగతం

పద్మశ్రీ అవార్డు వాపస్ ఇవ్వడం బజరంగ్ పునియా వ్యక్తిగత నిర్ణయమని కేంద్ర క్రీడాశాఖ పేర్కొంది. అవార్డులు వెనక్కి ఇవ్వాలనేది అతని వ్యక్తిగత నిర్ణయమైనప్పటికీ దీనిపై పునరాలోచించేలా బజరంగ్‌ను ఒప్పించడానికి ప్రయత్నిస్తామని తెలిపింది.



### సాక్షికి ప్రియాంక ఓదార్పు

రెజ్లింగ్ కెరీర్‌కు అనూహ్యంగా వీడ్కోలు పలికిన సాక్షి మాలిక్‌ను కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ ఓదార్చారు. శుక్రవారం ఆమె ఇంటికి వెళ్లిన ప్రియాంక జరుగుతున్న వివాదంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఒక మహిళగా తాను సాక్షి దగ్గరకు వచ్చానని ప్రియాంక తెలిపారు.

### విండీస్‌దే టీ20 సిరీస్

- ఐదో మ్యాచ్‌లో ఇంగ్లండ్ ఓటమి

తరౌబా (ట్రినిడాడ్): ఇంగ్లండ్‌తో జరిగిన నిర్ణయాత్మక ఐదో టీ20 మ్యాచ్‌లో వెస్టిండీస్ నాలుగు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో సిరీస్‌ను 3-2తో విండీస్ కైవసం చేసుకుంది. భారత కాలమానం ప్రకారం గురువారం అర్ధరాత్రి జరిగిన పోరులో తొలుత ఇంగ్లండ్ 19.3 ఓవర్లలో 132 పరుగులకు కుప్పకూలింది. ఫిల్ సాల్ట్ (38), లివింగ్ స్టోన్ (28), మొయిన్ అలీ (23) రాణించారు. కరీబియన్ బౌలర్లలో గుడాకేశ్ మోతీ మూడు, ఆండ్రీ రసెల్, అకీల్ హూస్సేన్, జేసన్ హోల్డర్ రెండేసి వికెట్లు పడగొడ్డారు. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన విండీస్ 19.2 ఓవర్లలో 133 పరుగులు చేసింది. హోప్(43 నాటౌట్), రూథర్‌ఫర్డ్(30) విజయంలో కీలకంగా వ్యవహరించారు. మోతీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', ఫిల్ సాల్ట్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు లభించాయి.









Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.